నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 28 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



## అపూర్వ సమ్మేళనం

అపూర్వ సమ్మేళనంలో సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు

రామకృష్ణాపూర్, జనవరి 27 : క్యాతనపల్లి మున్సిపాలిటీలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997-1998 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. శ్రీనివాస గార్డెన్‌లో అపూర్వ సమ్మేళనంలో నిర్వహించి, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు.

## అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఆర్డీవో



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లిరూరల్, జనవరి 27: బూదాకలన్ శివారులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం ఆర్డీవో హరికృష్ణ పరిశీలించారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి త్వరలోనే నోటీసులు అందిస్తామని, నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు. పోచమ్మ చెరువు పక్కన కబ్జాదారులు ఆక్రమించిన రెండెకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోచమ్మ ఆలయం పక్కనే నిర్మిస్తున్న ప్రీజర్ గదిని తహసీల్దార్ సుధాకర్, బెల్లంపల్లి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ భుజంగం సమక్షంలో కూల్చివేశారు.

## అవగాహన ఉంటేనే ప్రమాదాలను ఎదుర్కోవచ్చు

- ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బెటిన్‌సింగ్



మాట్లాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బెటిన్ సింగ్

మంచిర్యాల అర్బన్, జనవరి 27 : అవగాహన ఉంటే ఎలాంటి ప్రమాదాలనైనా ఎదుర్కోవచ్చని నేషనల్ డిసార్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఇన్‌స్పెక్టర్ బెటిన్ సింగ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోషల్ వెల్ఫేర్ కాలేజ్, ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాల విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, ఎన్‌సీసీ ఆఫీసర్ తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్, కిశోర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధి సందీప్‌కుమార్ రెడ్డితో పాటు 15 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## నేడు కేతేశ్వర-కంకాలమ్మ జాతర



అలయంలో పూజలు చేస్తున్న పూజారి భూమయ్య

జన్నారం, జనవరి 27 : మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ శివారులోగల వీర్లగుట్టపై వెలిసిన కేతేశ్వర-కంకాలమ్మ జాతరను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారని వారు తెలిపారు. అలాగే ఇక్కడి శివాలయం వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# జోరుగా యాసంగి సాగు

### వరి నాట్లలో నిమగ్నమైన రైతాంగం

- ఎన్నడూ లేనివిధంగా సన్న రకాలపై ఆసక్తి
- మద్దతుకు మంచి ధర పలకడంతో మక్కువ
- ఆరుతడి పంటలపై వెనకడుగు
- గూడెం ఎత్తిపోతలపైనే ఆశలు

దండేపల్లి, జనవరి 27 : జిల్లాలో యాసంగి సాగు పనులు జోరందుకున్నాయి. గతేడాది 1.04 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, ఈ యేడాది ఇప్పటికే 62,524 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో అత్యధికంగా వరి సాగవుతున్నది. ముందుగా కోతలు పూర్తయి.. నీటి వనరులున్నచోట ఇప్పటికే నాట్లు వేస్తుండగా, కోతలు ఆలస్యమైన చోట ఇప్పుడిప్పుడే మొదలుపెట్టారు. సాధారణంగా వానకాలంలో సన్నరకాలు, యాసంగిలో దొడ్డు రకాలు సాగు చేసే రైతన్నలు ఈసారి మాత్రం సన్న రకాల వైపే మొగ్గు చూపారు. గతంలో వేసిన సన్నాలకు మంచి ధర రావడంతో ఆ వైపు మళ్లారు. యాసంగిలో పంటచేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన, తుఫాను తదితర ప్రకృతి వైపరీత్యాల సమస్య ఉంటుంది. వీటిని తట్టుకునే స్వల్పకాలిక దొడ్డు రకాలపైనే రైతులు ఆధార పడేవారు. ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వానకాలంలో రైతులు ఎక్కువగా సన్నాలు సాగు చేయడంతో మంచి దిగుబడి వచ్చింది. దీంతో మార్కెట్‌లో సన్నాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. క్వింటాలుకు రూ.2500 నుంచి రూ.3200 వరకు ధర లభించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర రావడంతో రైతులు యాసంగిలోనూ సన్నాలపైనే దృష్టి సారించారు. 120 రోజుల నుంచి 135 రోజుల్లో చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలైన సాయిరాం, చిట్టిపొట్టి, అంకూర్ 101, జైశ్రీరాం తదితర రకాలను సాగు చేస్తున్నారు.



గూడెం ఎత్తిపోతల నుంచి కడెం కాలువలోకి వస్తున్న నీరు

**జిల్లాలో సాగు వివరాలు**

| | |
|---|---|
| సన్నరకం వరి | 35 వేల ఎకరాలు |
| దొడ్డు రకం | 26 వేల ఎకరాలు |
| మక్క | 841 ఎకరాలు |
| వేరుశనగ | 233 ఎకరాలు |
| ఇంతర పంటలు | 450 ఎకరాలు |

**ఆరుతడి పంటలు అంతంత మాత్రమే...**

నీటి వనరులు అందుబాటులో లేని రైతులు, ఇండ్లకు దగ్గరకు ఉండే పొలాల్లో అక్కడక్కడా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. అధికారులు ఆరుతడి పంటలు వేయాలని పదేపదే సూచిస్తున్నా రైతులు మాత్రం వరి వైపే మొగ్గు చూపుతున్నారు. ఆరుతడి పంటలకు ప్రధానంగా అడవి పందుల బెడద, పంట చేతికి వచ్చే సమయంలో అమ్మేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఎవ్వరూ ముందుకు రావడం లేదు. కడెం ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న పంట పొలాల్లో వన్యప్రాణుల బెడద అధికంగా ఉండడంతో రైతన్నలు ఆరుతడి పంటల సాగుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఇంటికి సమీపంలో, నీటి సౌకర్యం తక్కువగా ఉన్నచోట తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

**గూడెం ఎత్తిపోతలపైనే ఆశలు...**

గతంలో ఒకటో డిస్ట్రీబ్యూటరీ నుంచి 29వ డిస్ట్రీబ్యూటరీ వరకు కడెం నీటిని అందించగా, 30వ డిస్ట్రీబ్యూటరీ నుంచి చివరి వరకు గూడెం పథకం నుంచి నీటిని అందించేవారు. ఈసారి కడెంలో నీటిమట్టం తక్కువగా ఉండడంతో నీరు వదలడం లేదు. కేవలం ఎత్తిపోతల నీటిపైనే రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ నెల 6న గూడెం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగైతే చివరలో సాగునీటికి ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని, వీలైనంత ఎక్కువగా ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ రైతులు వరి సాగువైపే మక్కువ చూపుతున్నారు.



పెద్దపేట సమీపంలో సాగు చేస్తున్న మక్క

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్, జనవరి 27 : జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్ పోలీస్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు కమిటీలు వేసుకొని కలిసికట్టుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. పోలీస్ ఉద్యోగులకు రావాల్సి బెనిఫిట్స్‌ను వీలైనంత త్వరగా అందించేందుకు కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు. అదనపు కలెక్టర్ అచ్చేశ్వర్‌రావు, సంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు స్వామి, సంయుక్త కార్యదర్శి బిజీమాన్, ఆర్ఐలు పెద్దన్న,అంజన్న, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆధార్ అప్డేట్ త్వరగా పూర్తవ్వాలి



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కెరమెరి, జనవరి 27 : ఆదిమ గిరిజన తెగల ఆధార్ అప్డేట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్డేట్ కోసం కెరమెరికి వచ్చే మారుమూల ప్రాంతాల ఆదివాసులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, అల్పాహారంవంటి సదుపాయం కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్ పాల్గొన్నారు.

### పులులు స్వేచ్ఛగా తిరిగేలా

# పర్యావరణ వంతెనలు

### మంచిర్యాల-చంద్రాపూర్ జాతీయ రహదారిపై శరవేగంగా నిర్మాణాలు

- వాంకిడి-మహారాష్ట్ర సరిహద్దులతో పాటు రెబ్బెనలో ఎకో బ్రిడ్జిలు
- త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : మంచిర్యాల-చంద్రాపూర్ వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులతో పులులు, ఇతర వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్ర అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. అటవీజంతువులు తరచూ రోడ్డు దాటే ప్రాంతాలను గుర్తించి.. ఆయా ప్రదేశాల్లో పర్యావరణ వంతెనలను శరవేగంగా నిర్మిస్తున్నది.

**నేషనల్ హైవే అథారిటీతో కలిసి..**

మంచిర్యాల నుంచి చంద్రాపూర్ వరకు ఉన్న జాతీయ రహదారిని నాలుగు లేన్‌లుగా విస్తరిస్తున్నారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ రోడ్డు విస్తరణ కారణంగా చంద్రాపూర్‌లోని తడోబా-అంధేరి టైగర్స్ సంరక్షణ ప్రాంతాల నుంచి వచ్చే పులులు స్వేచ్ఛగా తిరగలేక పోతాయంటూ కొన్ని రోజుల క్రితం తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర సర్కారుకు లేఖలు రాశాయి. ఈ విషయమై నేషనల్ హైవే అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఓ నిర్ణయానికి వచ్చాయి. పులుల సంరక్షణలో భాగంగా పర్యావరణ వంతెనలు నిర్మించాలని నిర్ణయించాయి.



వాంకిడి మండలంలో శరవేగంగా సాగుతున్న పర్యావరణ వంతెన నిర్మాణం

**పర్యావరణ వంతెనల నిర్మాణం**

వాంకిడి-మహారాష్ట్ర సరిహద్దుల్లో, రెబ్బెన వద్ద రూ. 30 కోట్లతో ఎకో వంతెనల నిర్మాణం శరవేగంగా చేపడుతున్నారు. ఆయాచోట్ల సుమారు కిలో మీటరు మేర వంతెనలు నిర్మిస్తున్నారు. దాదాపు 150 మీటర్ల పొడవుతో వీటిని నిర్మిస్తున్నారు. వంతెన కింది నుంచి నాలుగు వరుసల రహదారిపై వాహనాల రాకపోకలు సాగనుండగా, పై నుంచి అడవి జంతువులు సంచరించేందుకు వీలుగా నిర్మాణం చేపడుతున్నారు. నాలుగు వరుసల రహదారి కిరువైపులా కొండలను ఆనుకొని ఎత్తైన వాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వంతెనపై గటేర్‌ల ద్వారా స్లాబ్ వేస్తారు. ఎకో వంతెనపై అడవిని తలపించేలా చెట్లు, పొదలు పెంచనున్నారు.

ఈ ఎకో బ్రిడ్జిల ఏర్పాటుతో కింది నుంచి వాహనాల రాకపోకలు సాగనుండగా, పై నుంచి వెళ్లే సంచరించే జంతువులకు అడవిలోనే ఉన్న భావన కలగనున్నది.

**మహారాష్ట్రలో 16 కిలో మీటర్ల మేర..**

పులులు, ఇతర వన్యప్రాణుల సంచారానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పర్యావరణ వంతెనలను ఏర్పాటు చేస్తారు. వంతెనపై సహజమైన అడవిని తలపించేలా చెట్లు, పొదలను పెంచేందుకు అనువుగా నిర్మాణాలుంటాయి. మహారాష్ట్రలోని పెంచ్ రిజర్వ్ ఫారెస్ట్ గుండా వెళ్తున్న జాతీయ రహదారి-44లో సుమారు 16 కిలోమీటర్ల వరకు పర్యావరణ హైలెవెల్ వంతెన నిర్మించారు. అడవులకు ఎలాంటి నష్టం జరగకుండా ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ వంతెన కింది నుంచి అడవి జంతువులు, పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు అనువైన వాతావరణం కల్పించారు. ప్రస్తుతం మహారాష్ట్ర -తెలంగాణ సరిహద్దుల్లోని వాంకిడి సరిహద్దు వద్దవద్ద నాలుగు లేన్‌ల జాతీయ రహదారి నిర్మాణం వలన పులులు, ఇతర అటవీ జంతువుల సంచారానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పర్యావరణ వంతెనలు(ఎకో బ్రిడ్జిలు) నిర్మాణం జరుగుతోంది.

# నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే రోడ్డు ప్రమాదాలు

- మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్
- ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు




మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ రాంనాథ్ కేకన్

మంచిర్యాల ఏసీసీ/గర్మిళ్ల, జనవరి 27 : నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. లైసెన్స్ తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడుపొద్దని, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సామాజిక బాధ్యతగా క్షతగాత్రులను దగ్గరలోని దవాఖానకు తరలించాలని కోరారు. త్వరలో లైసెన్స్ మేళా, ఆటో డ్రైవర్ల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసులను పరిష్కరించాలి

**కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

# బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్, జనవరి 27 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలసి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని సూచించారు. 2023లో కాగజ్‌నగర్ పోలీస్ సబ్ డివిజనల్ పరిధిలో 14 కేసులు, ఆసిఫాబాద్ పోలీస్ డివిజన్ పరిధిలో 10 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వేగంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లా ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు మొత్తం 400 మంది బాధితులకు రూ. 2 కోట్ల 33 లక్షల 38 వేల 750లను పరిహారం కింద అందించినట్లు తెలిపారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి, మానిటరింగ్ కమిటీ సభ్యులు కేశవరావు, అశోక్, సిడాం అర్జు, గోపాల్, గణేశ్, గంగుబాయి, వెంకటి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### రైతుబంధు, రుణమాఫీ

# ఇంకెప్పుడు?

- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి
- వెంటనే ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటు చేయాలి
- మందమర్రి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



వ్యవసాయ అధికారిని నిలదీస్తున్న కో ఆప్షన్ మెంబర్ నసీరొద్దీన్

మందమర్రి రూరల్, జనవరి 27 : 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నది.. రైతు రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారు. రైతుబంధు డబ్బులు ఇంకెప్పుడిస్తారు' అంటూ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. మందమర్రి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గుర్రం మంగ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఈ సమావేశం రసాభాసగా మారింది. సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. కేసీఆర్ సర్కారు పామాయిల్ సాగునుప్రోత్సహించిందని, ఇక్కడ వెంటనే పరిశ్రమ ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. కేసీఆర్ సర్కారు మాదిరిగానే సకాలంలో రైతు బంధు డబ్బులు విడుదల చేయాలని, వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, జడ్పీటీసీ వేల్పుల రవి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, కో ఆప్షన్ నసీరొద్దీన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈవో జాడి పోచయ్య, వైద్యాధికారి రమేశ్ పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నీ ప్రారంభం

మంచిర్యాల అర్బన్, జనవరి 27 : పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొత్తం 32 టీమ్‌లు పాల్గొననుండగా, ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకి రూ.20 వేలు, కప్, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకి రూ.15 వేలు, కప్, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకి రూ.10 వేలు అందచేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సీఐ రాజు, ఎస్ఐ విజయ్‌కుమార్, ఆలయ ఫౌండేషన్ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, కార్యదర్శి మూగ మహేశ్, ట్రినిటీ హైస్కూల్ నిర్వాహకులు బిజూ కురివిల్లా, స్థానిక వార్డు కౌన్సిలర్ చైతన్య, సత్యపాల్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బైరగోని సిద్దయ్య, జిల్లా వ్యాయామ విద్య సంఘం ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వల్లభ వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ నిర్వాహకులు బోరే యాదగిరి, రావుల రామ్మోహన్, మంచిర్యాల సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు మురళి, లక్ష్మీనారాయణ, గురువయ్య,చిందం శ్రీనివాస్, రఘు, దీక్షిత్, మనీష్‌కుమార్, కృష్ణంరాజు, కృష్ణ, తిరుపతి, వేణు, రాజ్‌కుమార్, వీరేశం పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు

# నిబంధనలు పాటించాలి

- ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్
- తాండూర్‌లో వాహనదారులకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్

తాండూర్, జనవరి 27 : ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం తాండూర్ ఐబీలో రోడ్డు భద్రతా నియమాలపై ఎస్ఐ రాజశేఖర్‌తో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వచ్చే నెల 14వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆటో డ్రైవర్లు, ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్డు భద్రత అనేది ప్రతిక్షణం, ప్రతి నిమిషం, ప్రతిరోజూ అవసరమని, దానిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం పలు సూచనలు చేసి, వాహనాలకు స్టిక్కర్లను అంటించారు. రవాణా శాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.